క్లుప్తంగా

వాతావరణ మార్పులపై రైతుల ఆందోళన



వత్సవాయి : మండలంలో సోమవారం చోటుచేసుకున్న వాతావరణ మార్పులు మిర్చి రైతులను ఆందోళనకు గురిచేశాయి. ఉదయం నుంచే ఆకాశంలో మబ్బులతోపాటు చల్లటి గాలులు వీచడంతో కల్లాల్లో మిర్చిని కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు పరుగులు పెట్టారు. ఆరబెట్టిన కాయలను ఒక చోట కుప్పగా చేర్చి పట్టాలు కప్పుకునేందుకు తంటాలు పడ్డారు. మిర్చి పంట ప్రస్తుతం కల్లాల్లోనే అధికంగా ఉంది. చివరికోత కాయలు కల్లాల్లోనే ఉన్నాయి. ఇంకా కొన్ని కోతలు కోయని పొలాలు కూడా ఉన్నాయి. ఈ సమయంలో మబ్బులు చేయడంతో రైతులు కంగారుపడ్డారు. ఇటువంటి సమయంలో వర్షం పడితే కల్లాలో ఉన్న కాయలతోపాటు కోతకు వచ్చిన మిరపకాయలు కూడా తడిసి రంగుమారి తాలుకాయలుగా మారే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అసలే ధర లేక అల్లాడుతుండగా, వాతావరణ మార్పులు సైతం మరింత భయాందోళనలకు గురిచేస్తున్నాయని రైతులు చెబుతున్నారు.

వాహనాల తనిఖీ



వీరులపాడు:ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులు, కూలీలను ఎక్కిస్తే ఉపేక్షించేది లేదని ఎస్‌ఐ అనిల్ హెచ్చరించారు. మండలంలోని వెల్లంకి గ్రామ సమీపంలో సోమవారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు విధిగా వాహనాలకు సంబంధించిన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా ఇష్టారీతిన ప్రయాణికులు, కూలీలను ఎక్కించి ఆటోలు నడిపేవారిపై కేసులు నమోదు చేయడంతోపాటు వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. ఓవర్‌లోడ్ కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వివరించారు. ఈక్రమంలో వ్యవసాయ కూలీలతో వస్తున్న ఆటోను నిలుపుదల చేసి కూలీలకు అవగాహన కల్పించారు. ఆటోడ్రైవర్‌కు రూ.2వేల జరిమానా విధించారు.

పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి : సీపీఎం



నందిగామటౌన్: ప్రభుత్వాలు మారుతున్న పేదల సొంతింటి కల మాత్రం నెరవేరడం లేదని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి కటారపు గోపాల్ అన్నారు. 18వ వార్డులో ఏళ్ల తరబడి నివాసముంటున్న నిరుపేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు సోమవారం ఆర్డీవో కె.బాలకృష్ణను కలసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా గోపాల్ మాట్లాడుతూ 18వవార్డులో 23ఏళ్లుగా నివాసముంటున్నా ఇళ్ల పట్టాలు మాత్రం రాలేదన్నారు. ఇళ్లపట్టాలు లేకపోవడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి వెంటనే పట్టాలు అందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గోపీనాయక్, జంగా దామోదర్, బి.లాజర్ తదితరులు పాల్గొన్నారు.

26న సామాజిక తనిఖీ ప్రజావేదిక

పెనుగంచిప్రోలు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద మండలంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించినట్లు ఎంపీడీఓ జి.శ్రీను తెలిపారు. సామాజిక తనిఖీల్లో గుర్తించిన అంశాలపై బుధవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బహిరంగ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు వివరించారు. సమావేశానికి సంబంధిత శాఖల అధికారులు, ప్రజలు హాజరుకావాలని కోరారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

కంచికచర్ల: లారీని వెనుక నుంచి బైక్ ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడి వైద్యశాలలో చికిత్సపొందుతున్న యువకుడు మృతిచెందిన ఘటన సోమవారం కంచికచర్ల మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాజు కథనం మేరకు తూర్పుగోదావరి జిల్లా గొల్లప్రోలు మండలం గొల్లప్రోలు గ్రామానికి చెందిన హరహర వీరాచారి(25) హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. బైక్‌పై ఆదివారం హైదరాబాద్ నుంచి సొంతూరుకు బయలుదేరాడు. ఈక్రమంలో మండలంలోని పరిటాల సమీపంలో రాగానే ఫ్లైఓవర్ రోడ్డుపై ముందు వెళ్తున్న లారీ సడన్‌గా రోడ్డు పక్కన ఆగింది. ఈ విషయాన్ని గమనించని వీరాచారి లారీని వెనుకనుంచి బైక్‌తో ఢీకొట్టాడు. ఈ ఘటనలో అతని తలకు తీవ్రగాయాలయ్యాయి. వ నేషనల్ హైవే అంబులెన్స్ వాహన సిబ్బంది అతన్ని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రసాభాసగా పేట కౌన్సిల్ సమావేశం

- పేట మున్సిపల్ చైర్మన్ తీరుపై వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ల నిరసన
- పోడియం ఎదుట బైఠాయింపు
- నిధుల కేటాయింపులో వివక్షపై చైర్మన్‌ను నిలదీత
- ఎర్రకాలువ, వేపలవాగు ప్రక్షాళనకు డిమాండ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, పక్కన మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర



అక్రమ లేఅవుట్ల ఫొటోలను ప్రదర్శిస్తున్న కౌన్సిలర్ వట్టెం మనోహర్, వైస్‌చైర్‌పర్సన్ హఫీజున్నీసా,బషీరున్నీసాబేగం

జగ్గయ్యపేటఅర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ బీఫారంతో ఫ్యాన్ గుర్తుపై గెలిచి మున్సిపల్‌చైర్మన్‌గా ఎన్నికైన రంగాపురం రాఘవేంద్ర ఇటీవల టీడీపీలో చేరడంతోపాటు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల వార్డులకు నిధులు కేటాయించకుండా వివక్షత చూపిస్తున్నారని ఐదోవార్డు కౌన్సిలర్ వట్టెం మనోహర్ నిలదీశారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో చైర్మన్ రాఘవేంద్ర అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించగా, ఎక్స్ అఫిషియో సభ్యుడి హోదాలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) హాజరయ్యారు. ముందుగా కౌన్సిల్ సీసీ తాజుద్దీన్ ఏజెండాలోని అంశాలను కౌన్సిల్ సభ్యులకు వినిపించారు.ఈసందర్భంగా చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ మున్సిపాలిటీ చరిత్రలో భారీస్థాయిలో అభివృద్ధి పనులతో కూడిన అజెండాను ఓ కౌన్సిల్ సమావేశంలో పెట్టడం ఇదే ప్రథమమని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీకి చెందిన ఐదోవార్డు కౌన్సిలర్ వట్టెం మనోహర్ మాట్లాడుతూ తమ వార్డుకు డీఎంఎఫ్ గ్రాంట్ కేటాయింపులు చేయకపోవడంపై మున్సిపల్‌చైర్మన్‌ను నిలదీశారు. దీంతో మనోహర్, చైర్మన్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈసందర్భంలో ఎమ్మెల్యే తాతయ్య జోక్యం చేసుకుంటూ వార్డుల్లో ప్రధానమైన సమస్యలు ఏమైనా ఉంటే తనకు లిఖితపూర్వకంగా ఇస్తే నిధులు కేటాయించే విషయంలో అన్యాయం జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

అక్రమ లేఅవుట్ల ఫొటోలు ప్రదర్శన..

అక్రమ లేఅవుట్లు, ఎర్రకాలువ, వేపలవాగు ప్రక్షాళనకు తగిన హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా, కౌన్సిలర్ వట్టెం మనోహర్, కోఆప్షన్ సభ్యురాలు బషీరున్నీసాబేగం పోడియం ఎదుట నేలపై కూర్చొని నిరసన వ్యక్తంచేశారు. కూటమి ప్రభుత్వ పాలనలో జగ్గయ్యపేటలో 100ఎకరాలకు పైగా అక్రమ లేఅవుట్లు వేయగా, రూ.20కోట్ల విలువగల పదిశాతం ఆస్తిని మున్సిపాలిటీ కోల్పోయిందన్నారు. ఇందుకు మున్సిపల్ చైర్మన్, కమిషనర్, టీపీఓ బాధ్యత వహించాలంటూ అక్రమ లేఅవుట్ల ఫొటోలను ప్రదర్శించారు.

కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం..

ఎర్రకాలువ, వేపలవాగుల ప్రక్షాళన అంశం టీడీపీ కౌన్సిలర్లు రామలక్ష్మి, సైదేశ్వరరావు, వెంకట్, గీతారాణి.. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదానికి దారితీసింది. గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను అమలుచేసి ఎర్రకాలువ, వేపలవాగును ప్రక్షాళన చేయాలని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. అక్రమ లేఅవుట్లపై ఎమ్మెల్యే తాతయ్య జోక్యం చేసుకొని ఈ వ్యవహారం తన దృష్టికి రాలేదన్నారు. ప్రభుత్వ రూల్స్, గైడ్‌లైన్స్ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. నిరసనను విరమించి లేచి సీట్లలో కూర్చొవాలని, లేనిపక్షంలో సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ప్రజాసమస్యలపై తమ పోరాటం ఆగదని, సస్పెన్షన్‌కు భయపడేది లేదన్నారు. ఈ విషయంపై స్పష్టమైన హామీ ఇచ్చేవరకు నిరసన విరమించేది లేదని పేర్కొన్నారు. దీంతో మనోహర్‌ను రెండునెలలపాటు సస్పెండ్ చేస్తున్నట్లు చైర్మన్ రాఘవేంద్ర ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే తాతయ్య సూచనల మేరకు సస్పెన్షన్‌ను తొలగిస్తున్నట్లు చైర్మన్ తెలిపారు.

అధికారులపై అవినీతి ఆరోపణలు..

మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు పందుల రోశయ్య, కొలగాని రాము మాట్లాడుతూ మున్సిపాలిటీ అధికారుల తీరుపై ధ్వజమెత్తారు. కంట్రాక్టర్ల బిల్లులు చేయకుండా కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులు ఏళ్ల తరబడి ఇబ్బందులు పెడుతున్నారన్నారు. మున్సిపాలిటీ అధికారుల్లో అవినీతి, నిర్లక్ష్యం పెరిగిపోయిందని ఆరోపించారు. కౌన్సిలర్లు గింజుపల్లి వెంకట్రామయ్య, అలేఖ్య, గీతారాణి, హఫీజున్నీసా, బషీరున్నీసా తదితరులు ఆయా వార్డుల్లోని సమస్యలను ప్రస్తావించారు. కమిషనర్ ఎం.రామ్మోహనరావు, డీఈఈ, టీపీవో, ఆర్‌వో పాల్గొన్నారు.

నందిగామ అభివృద్ధికి కృషి

నందిగామటౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ తొమ్మిది నెలల్లో నందిగామ మున్సిపాలిటీలో చేసిన అభివృద్ధిని ప్రజల ముందుంచుతున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. స్థానిక బాబు జగ్జీవన్‌రాం భవన్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి అధ్యక్షతన సోమవారం మున్సిపల్ బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి రూ. ఐదు కోట్లు కేటాయించి సిమెంట్ రోడ్లు, డ్రైన్లు నిర్మించామన్నారు. ప్రజలకు అవసరమైన అన్ని మౌలికవసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. 2028 నాటికి శాశ్వత మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేసి పట్టణంలోని ప్రతి ఇంటికి తాగునీటిని సరఫరా చేస్తామని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ రమణబాబు మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మున్సిపాలిటీ ఆదాయాన్ని రూ.12.84 కోట్లుగా అంచనా వేశామన్నారు. సాధారణ ఖర్చులు రూ. 12.05 కోట్లు పోను మిగులు ఆదాయం రూ.79 లక్షలుగా పేర్కొంటూ ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించినట్లు వివరించారు. సమావేశంలో వైస్ చైర్మన్లు పాకాలపాటి కృష్ణ, ఓర్సు లక్ష్మి, కౌన్సిలర్లు షేక్ ఖాలిక్, షేక్ యాకుబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.



బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న విప్, ఎమ్మెల్యే సౌమ్య

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి : ఏడీఏ

నందిగామరూరల్: పంటలు సాగు చేసిన ప్రతి రైతు విధిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని కేతవీరునిపాడులోని రైతు సేవాకేంద్రంను సందర్శించి ఈ పంట నమోదు, రబీ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతుల ఈ కేవైసీ నమోదును సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తాము సాగుచేసిన పంటలకు ఈ క్రాప్ నమోదు చేయించుకుంటేనే పంటనష్టపరిహారం అందుతుందన్నారు. వ్యవసాయానికి సంబంధించిన ట్రాక్టర్ యంత్ర పరికరాలు, తైవాన్, బ్యాటరీ స్ప్రేయర్లు తదితరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అవసరమైన రైతులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను పరిశీలించి రాయితీపై పరికరాలను అందిస్తామని చెప్పారు. అంతకుముందు ఆయన కేతవీరునిపాడులోని మొక్కజొన్న పంట పొలాలను, రబీ సీజన్‌లో పంటల నమోదు సామాజిక తనిఖీ నిమిత్తం ఏర్పాటు చేసిన రైతుల జాబితా ప్రదర్శనలను పరిశీలించారు. కార్యక్రమంలో వీఏఏ మస్తాన్, రైతులు పాల్గొన్నారు.



మొక్కజొన్న పంటను పరిశీలించి రైతులకు మాట్లాడుతున్న ఏడీఏ శ్రీనివాస్

ఏనుగువాగుపై వంతెన నిర్మించరూ..

- శంకుస్థాపన చేసి వదిలేసిన గత కూటమి ప్రభుత్వం..
- తీవ్ర ఇబ్బందుల్లో ప్రజలు
- ఈసారైనా వంతెన నిర్మించాలని డిమాండ్



గత కూటమి ప్రభుత్వంలో వేసిన శిలాఫలకం



చెన్నారావుపాలెం గ్రామ సమీపంలోని ఏనుగు గడ్డ వాగు

వీరులపాడు: మండలంలోని చెన్నారావుపాలెం గ్రామశివారులోని ఏనుగుగడ్డ వాగుపై వంతెన లేకపోవడంతో రాకపోకలు నరకప్రాయంగా మారాయి. వాగుపై వంతెన నిర్మించకపోవడంతో వాగుకు అవతలి వైపు ఉన్న పంట పొలాలకు వెళ్లాలంటే తీవ్ర అవస్థలుపడుతున్నట్లు రైతులు వాపోతున్నారు. మూడేళ్ల కిందట గ్రామ సర్పంచ్ స్పందించి తాత్కాలిక పనులు చేపట్టిన పూర్తి స్థాయిలో ప్రయోజనం లేకపోయిందని ప్రజలు నిట్టూరుస్తున్నారు. ఏనుగు వాగుపై వంతెన నిర్మించకపోవడంతో శివారు గ్రామంగా ఉన్న తిమ్మాపురం వెళ్లేందుకు కూడా 13కిలోమీటర్ల మేర ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంది. ముఖ్యంగా వర్షాలు, వరదల సమయంలో దయనీయ పరిస్థితులు ఎదుర్కొంటున్నామని చెన్నారావుపాలెం గ్రామస్తులు వాపోతున్నారు.

వ్యవసాయ పనులకు అవస్థలే..

చెన్నారావుపాలెం గ్రామంలోని అధికశాతం మంది ప్రజలు వ్యవసాయం, వ్యవసాయ పనులపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గ్రామానికి చెందిన రైతుల పంట పొలాలలో సుమారు 800 ఎకరాల వరకు ఏనుగుగడ్డ వాగుకు అవతలి వైపునే ఉన్నాయి. పంట పొలాలకు వెళ్లి రావాలంటే వాగులో దిగి వెళ్లాల్సిందే. దీంతో రైతులు పడుతున్న అవస్థలు చూసి స్పందించిన సర్పంచ్ పత్తిపాటి మల్లికార్జునరావు రైతులు పంట పొలాలకు వెళ్లి వచ్చేందుకు ఇబ్బంది లేకుండా తాత్కాలికంగా పనులు చేపట్టారు. దీంతో సాగు సమయంలో ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ కూలీలను తరలించేందుకు ఇబ్బంది లేకపోయినప్పటికీ పంట ఉత్పత్తులను ఇళ్లకు చేర్చేందుకు మాత్రం అనేక వ్యయ ప్రయాసలు తప్పటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తిమ్మాపురం వెళ్లాలంటే చుట్టూ తిరగాల్సిందే..

చెన్నారావుపాలెం గ్రామానికి తిమ్మాపురం శివారు గ్రామం ఉంది. తిమ్మాపురం గ్రామానికి వెళ్లాలంటే మండలంలోని జుజ్జూరు, అల్లూరు, పెద్దాపురం, గూడెం మాధవరం మీదుగా సుమారు 13 కిలోమీటర్ల మేర తిరిగి వెళ్లాల్సి వస్తుందని అదే ఏనుగుగడ్డ వాగుపై వంతెన నిర్మిస్తే ఆరు కిలోమీటర్ల ప్రయాణంతో గ్రామానికి చేరుకోవచ్చని ప్రజలు చెబుతున్నారు. పంట ఉత్పత్తులను సైతం చుట్టూ తిప్పి ఇళ్లకు చేర్చాల్సి వస్తుండటం ఇబ్బందితోపాటు కిరాయి ఖర్చులు పెరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు. వంతెన నిర్మిస్తారనే మా ఆశ అడియాశలవుతుంది తప్ప వంతెన నిర్మాణ విషయాన్ని మాత్రం పాలకులు పట్టించుకోవడం లేదని ప్రజలు తీవ్ర నిరాశ చెందుతున్నారు.

వరద వస్తే జలదిగ్బంధమే..

సాధారణ రోజుల్లో ఎలా ఉన్నా వర్షాకాలంలో మాత్రం ప్రజలు ప్రాణాలు అరచేత పట్టుకుని జీవనం సాగించాల్సిందే. వర్షాలు అధికంగా కురిసి ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చిన ప్రతిసారి ఏనుగుగడ్డ వాగు పొంగి ప్రవహిస్తుంటుందని వరద ఉధృతి అధికంగా ఉన్న సమయంలో చెన్నారావుపాలెం, తిమ్మాపురం గ్రామాలు జల దిగ్బంధమవుతున్నాయి. గతేడాది వచ్చిన వరదల సమయంలో సైతం ఇళ్లలోకి నీరు చేరి రోజుల తరబడి ఇబ్బందులు పడాల్సి వచ్చిందని గ్రామస్తులు చెబుతున్నారు. అంతే కాకుండా ఏనుగుగడ్డ వాగుపై బ్రిడ్జి లేకపోవటంతో రాకపోకల సమయంలో వాగులో పడి పలువురు మృత్యువాత పడిన ఘటనలు సైతం ఉన్నాయని గ్రామస్తులు గుర్తుచేస్తున్నారు.

పనులు శిలాఫలకానికే పరిమితం..

ఏనుగు గడ్డ వాగుపై వంతెన నిర్మించాలని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయిందని చెన్నారావుపాలెం ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2014-19 టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడ వంతెన నిర్మాణానికి రూ. 93లక్షల నిధులు మంజూరయ్యాయని ఆపార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి హడావిడిగా శంకుస్థాపన చేసి వదిలేశారు తప్ప పనులు మాత్రం చేపట్టలేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఇకనైనా పాలకులు, అధికారులు స్పందించి ఏనుగుగడ్డ వాగుపై వంతెన నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పంట పొలాలకు వెళ్లేందుకు అవస్థలు..

ఏనుగుగడ్డ వాగుకు అవతలి వైపున ఉన్న పంట పొలాలకు వెళ్లాలంటే అవస్థలు తప్పడంలేదు. ముఖ్యంగా పంట ఉత్పత్తులను ఇళ్లకు చేర్చాలంటే నానాఇబ్బందులు పడుతున్నాం. వర్షాల సమయంలో జీవాల మేతకు కూడా వాగు దాటలేకపోతున్నాం. వాగుపై వంతెన నిర్మించి మమ్మల్ని ఆదుకోవాలి.



– కంతుల కోటయ్య, చెన్నారావుపాలెం

ఇకనైనా వంతెన నిర్మించాలి..

గ్రామంలోని ఏనుగుగడ్డ వాగుపై వంతెన నిర్మిస్తే రెండు గ్రామాల ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుంది. చెన్నారావుపాలెం-తిమ్మాపురం మధ్యన ప్రయాణ దూరం సగానికి మేర తగ్గుతుంది. వర్షాలు, వరదల సమయంలో సైతం పంట పొలాలకు వెళ్లే వెసులుబాటు ఉంటుంది. ప్రభుత్వం స్పందించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.



– పత్తిపాటి మల్లికార్జునరావు, సర్పంచ్

అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం



నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జగ్గయ్యపేటఅర్బన్: రెండురోజుల కిందట తూర్పుగోదావరి జిల్లా, గోపాలపురం నియోజకవర్గం నల్లజర్ల మండలం దూబచర్లలో అంబేడ్కర్ విగ్రహం మెడలో చెప్పుల దండ వేసిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని వైఎస్సార్ సీపీ నేతలు డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ఆదేశాల మేరకు ఆపార్టీ నాయకులు సోమవారం స్థానిక రైతుబజారు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రాష్ట్రంలో శాంతిభద్రతలను గాలికి వదిలివేయడంతో ఇష్టారీతిన గూండాలు ఇలా రెచ్చిపోతున్నారని మండిపడ్డారు. ఇటువంటి దుశ్చర్యకు పాల్పడిన దుండగులను ప్రభుత్వం వెంటనే అరెస్టుచేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విజయవాడ కనకదుర్గ దేవస్థానం మాజీ డైరెక్టర్ నంబూరి రవి, రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు కన్నమాల శామ్యూల్, రాష్ట్ర ఎస్టీ సెల్ నాయకుడు బద్దూనాయక్, మండల మహిళా సమాఖ్య మాజీ అధ్యక్షురాలు చల్లా సుశీల, నాయకులు బీఎస్ఎస్ఎల్ రామారావు, గంగోలు వినోద్, గోగుల వెంకయ్య, దార్ల ప్రసన్నకుమార్, ఎండీ.ఇమ్రాన్‌పాషా, బాణావత్ రాజు, శీలం మంగారావు, కొండమూరి సన్నీ పాల్గొన్నారు.

పది పరీక్షలకు 6,030 మంది హాజరు

నందిగామ రూరల్: నందిగామ డివిజన్‌లోని నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల పరిధిలో జరుగుతున్న పదోతరగతి పరీక్షల్లో భాగంగా సోమవారం నిర్వహించిన గణితం పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. డివిజన్ పరిధిలోని 40 పరీక్షా కేంద్రాలలో 6,103మంది విద్యార్థులకుగాను 6,030 మంది పరీక్షకు హాజరైనట్లు ఇన్‌చార్జ్ డీవైఈఓ సాంబశివరావు తెలిపారు. 73మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వివరించారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

నందిగామరూరల్: పదోతరగతి పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని ఆర్డీవో కె.బాలకృష్ణ ఆదేశించారు. పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా వసతులు కల్పించాలని సూచించారు.



నందిగామ జెడ్పీ పాఠశాల పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ కె.బాలకృష్ణ

వార్షిక బడ్జెట్‌కు ఆమోదం

జగ్గయ్యపేట అర్బన్: పేట మున్సిపాలిటీ కౌన్సిల్‌లో సోమవారం రూ.30కోట్ల అంచనాలతో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు. రెవెన్యూ జమలు రూ.16.33కోట్లుగా, రెవెన్యూఖర్చులు రూ. 11.92కోట్లు, మూలధనం జమలు రూ.30.05 కోట్లుగా, మూలధనం ఖర్చులు రూ.15.34కోట్లుగా వార్షిక బడ్జెట్‌లో చూపించారు. నికర మిగులు రూ.11.92 కోట్లు అని సమావేశానికి అధ్యక్షత వహించిన మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. ఎక్స్ అఫిషియో సభ్యులు, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), కమిషనర్ రామ్మోహనరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మద్యానికి డబ్బులు ఇవ్వలేదని యువకుడి ఆత్మహత్య



గోపి మృతదేహం

దేవరుప్పుల : మద్యం తాగడానికి డబ్బులు అడగగా భార్య నిరాకరించడంతో క్షణికావేశానికి గురైన ఓ యువకుడు పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సీతారాంపురంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఊర సృజన్ కుమార్ కథనం ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలుకు చెందిన బత్తుల గోపి (27) తన కుటుంబంతో జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సీతారాంపురం గ్రామానికి వలస వచ్చాడు. ఇక్కడ సమీప బంధువైన బత్తుల రామకృష్ణ ఇటుకబట్టీల వద్ద నాలుగు నెలలుగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం సాయంత్రం మద్యం కోసం రూ.200 కావాలని భార్యను అడగగా ఆమె నిరాకరించడంతో గొడవపడ్డాడు. అనంతరం క్షణికావేశంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. చుట్టుపక్కల వారు గమనించి వెంటనే జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తల్లి వెంకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

వత్సవాయి: మండలంలోని ఎనిమిది సచివాలయాల పరిధిలో మంగళవారం నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంప్‌లను నిర్వహిస్తామని ఎంపీడీవో ఎస్.రాంబాబు తెలిపారు. ఈనెల 25వతేదీ మంగళవారం మంగొల్లు-1, మాచినేనిపాలెం సచివాలయాల పరిధి, 26న మంగొల్లు-2, కాకరవాయి, 27న భీమవరం-1, కంభంపాడు, 28న దబ్బాకుపల్లి, భీమవరం-2 సచివాలయాల పరిధిలో ఈ క్యాంపులు నిర్వహిస్తామన్నారు.

ఉదయం పది గంటల నుంచి ఆధార్ క్యాంపులు ప్రారంభమవుతాయన్నారు. ఆధార్‌లో పేర్లు, ఇంటిపేర్లు తప్పులు, అడ్రసు సరిచేయడం, చిన్న పిల్లలకు ఆధార్‌జారీ తదితర సేవలను పొందవచ్చన్నారు. పుట్టినతేదీలో మార్పులు చేయాలంటే ఖచ్చితంగా సంబంధిత సర్టిఫికెట్లు జతపరిచి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని ఎంపీడీఓ స్పష్టం చేశారు. ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు కంచికచర్ల మండల పరిషత్ సమావేశం

కంచికచర్ల : మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం ఉదయం పదిగంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బీఎం విజయలక్ష్మి సోమవారం తెలిపారు. ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్నిశాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

చలివేంద్రాలు ప్రారంభం

నందిగామరూరల్: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు అవసరమైన అన్నిచర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ఏడు ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను మున్సిపల్ చైర్‌పర్సన్ కృష్ణకుమారి, కమిషనర్ రమణబాబుతో కలిసి సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయా గ్రామాల నుంచి నియోజకవర్గ కేంద్రానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చలివేంద్రాల ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గ్రామాల్లో కూడా చలివేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

పెనుగంచిప్రోలు: స్థానిక ఆర్‌కె ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రమేష్, కాకాని బ్రహ్మం, కుదుముల వెంకటరామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా 108 మంది రైతులకు ఉగాది పురస్కారాలు అందజేస్తామని వివరించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే రాజగోపాల్, ఎంపీ కేశినేని శివనాథ్, రాష్ట్ర సేంద్రియ ఉత్పత్తుల ధృవీకరణ అధారిటీ చైర్మన్ శ్యామల దేవదత్, రైతునేస్తం చైర్మన్ వై.వెంకటేశ్వరరావు, దక్షిణ రాష్ట్రాల సేంద్రియ రైతుల శిక్షకులు నాగరాజు హాజరుకానున్నట్లు తెలిపారు. సేంద్రియ సాగు రైతులు, గోశాల నిర్వాహకులు హాజరుకావాలని కోరారు.

క్షయవ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ

నందిగామటౌన్: క్షయ వ్యాధి నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయని ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రి సిబ్బంది పట్టణంలోని ప్రధాన వీధుల్లో క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్షయ వ్యాధి నిర్మూలనకు తమవంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం టీబీ విభాగం ఆధ్వర్యంలో ఉచితంగా మందులు, ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

గండ్రాయి హెచ్ఎంకు అవార్డు



జగ్గయ్యపేట: మండలంలోని గండ్రాయిలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నేలవెల్లి రమేష్‌బాబు జాతీయ ఉగాది పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్ సుందరయ్య భవన్‌లో ఆదివారం రాత్రి సర్వేజనా సుఖినో భవంతు సామాజిక సాంస్కృతిక సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి చంద్రయ్య చేతుల మీదుగా ఆయన జాతీయ ఉపాధ్యాయ రత్న-2025 అవార్డును అందుకున్నారు. అవార్డు అందుకున్న రమేష్ బాబును పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.